# బళ్ళు తెరిచారు

పిశుపాటి ఉమామహేశ్వరమ్

బళ్ళు తెరిచారు

మధ్యతరగతి కుటుంబరావులకి మరో సారి ఎమర్జెన్సీ పెట్టేశారు

పెళ్ళిళ్ళ సీజనూ, ఊరగాయల సీజనూ, ఆ వెనక స్కూల్స్ రీఓపెనింగ్ సీజనూ అయ్యాక—ఇదీవరస

కొత్తబట్టలు కొత్త పుస్తకాలు (బ్లాకులో అమ్మినా ప్రభుత్వపు అప్పు తప్పులొద్దు?). యూనీఫామ్సైతే మరీ ఎమర్జెంటు వెహికిల్స్‌కి యాక్సెసరీస్ ఉన్నట్టు యూనీఫారం వంటిపెట్టుకుని షూస్, సాక్స్, బెల్ట్, టై, రిబ్బన్స్, బాడ్జెస్ గట్రా, గట్రా ఎన్నెన్నో ఫీజుల సంగతి సరేసరి కుటుంబ నియంత్రణ పాటించని కొంపల్లో సాక్షాత్తూ ఆ సరస్వతీ దేవి వేసే ఉరిశిక్ష—ఈతంతులూ తమాషాలూ

వెకేషన్సులో విశ్రాంతి తీసుకునే తల్లులకు మళ్ళీ ఏడాది పొడుగు డ్యూటీలు పిల్లలందరికీ మేలుకొలుపులు బాత్రూం దగ్గర క్యూలు కంచాల దగ్గర కుయ్ కుయ్‌లూ బాక్సులూ, వాటర్ బాగ్‌లూ డ్రెస్సులూ, మేకప్పులూ మధ్యమధ్య పైకప్పు ఎగిరిపోయే ఏడుపులూ శ్రీవారి హడావుడిల మధ్య రిక్షావాడి తొందరలు నడకా పరుగూ కాని స్థితిలో నడుములు విరిగే పని పగలూ రాత్రీ యింట్లో 'చదివింపులకై "వొడ్డింపులు' వీటితో ప్రాణం చావొచ్చి సన్యాసం మీదికి మనసు పోవడం

ఇవన్నీ ఇలా ఉంటే

కొత్తగా స్కూల్లో చేర్పించవల్సిన తలిదండ్రుల కేసులు మరీ దారుణం

వీధిబళ్ళో చదుకున్న తలిదండ్రుల గ్గూడా కాన్వెంట్ స్కూల్స్ కావాలి ... వింకిలాగూ చీమిడిముక్కు పిల్లలు గూడా 'మమ్మీ' 'డాడీ' అనాలి .. వీళ్ళ నాదు కోడానికి ఎన్ని 'తడికె' 'పాకల' 'సెయింట్ కాన్వెంట్స్' లేచినా ఇంకా కొరతే కడుపుతో ఉన్నప్పట్నించీ కాకా పట్టినా, డొనేషన్ స్కూల్స్‌లో రిజర్వేషన్స్ శూన్యం బోర్డులు చూసి బోల్తా పడ్డ వాళ్ళు లేచేసరికి ఆర్నెల్ల పరీక్షలు 'హాలో' అంటాయి ఆ దెబ్బతో కట్టిన డొనేషన్లకీ, స్పెషల్ టర్మ్ ఫీజులకీ నీళ్ళొదులు కోలేక కళ్ళొత్తుకుంటూ

మరో ప్రహసనం ట్రాన్స్‌ఫర్స్

ఏళ్ళతరబడి ఎదురు చూసిన ట్రాన్స్‌ఫర్ వెళ్ళబోయే ఊళ్ళో అన్ని స్కూల్స్‌లోనూ సీట్లయిపోయేక వస్తుంది సంసారం ఎత్తలేక ఉంచలేక రిలీవర్ కోసం జపం చేస్తూ ఆవూరూ ఈవూరూ మధ్య మీటర్ రాళ్ళను పలకరిస్తూ ఆడిట్లూ ఇన్‌స్పెక్షన్స్ అవాంతరాలకి బలైపోతూ కొత్త ఊళ్ళలో కొత్త ఇన్‌ఫ్లుయెన్సులు పుట్టించలేక స్టాండర్డ్ ఉన్న స్కూల్లో సీటు దొరక్క సీటు దొరికే స్కూలు స్టాండర్డ్‌కి సర్దుకుపోలేక కొండొకచో ఎందుకొచ్చిన గొడవలే అని పాత ఊళ్ళో కంటిన్యూ అవడం దాంతో రెండూళ్ళ మధ్య షటిల్, లివ్ వేస్ట్ మనీ వేస్ట్ హెల్త్ డౌన్ అక్కడ అదుపులేక పిల్లలు కట్టు తప్పిపోతుండడం అయ్యా ఈ కష్టాలనంతం.

ఇక పోతే ప్లేటుకి రెండో వేపు

బళ్ళు తెరిచారు,

నిన్నటివరకూ నిర్మానుష్యంగా ఉన్న స్కూల్స్‌లో మళ్ళీ పిల్లల సందడి (శెలవుల్లో అద్దె కిచ్చుకుంటే పెళ్ళిళ్ళ సందడి తప్పించి). చాలామంది ప్యాసయ్యి పై క్లాసులోకెళ్ళేవాళ్ళూ. కారణాంతరాల చేత కొంతమంది అదే క్లాసులో దిగడిపొయ్యేవాళ్ళు ..అన్ని క్లాసుల్లోనూ కొన్ని న్యూ ఎడ్మిషన్స కొత్తమొహాలూ ..

ఓపక్క శెలవుల తర్వాత ఫ్రెండ్స్‌ని కల్సుకున్న ఆనందమైతే మరోపక్క ట్రాన్స్‌ఫర్ కేసుల కొత్త ఊరు బెదురు చూపులు తప్పి సీనియర్లయిపోయిన ఆకతాయి కుర్రాళ్ళ దుడుకు చేష్టలు ప్యాసైన వాళ్ళదంతా ఓ ప్రపంచమైతే

తప్పినవాళ్ళదంతా ఓ ప్రపంచం

ఎంతైనా. ,కొత్తబట్టలూ కొత్త పుస్తకాలూ కొత్త మొహాలూ కొత్త స్నేహాలూ .కొత్త వాతావరణం కొత్త కొత్త అంతా కొత్త ఈ కొత్తలో పాఠాలుండక. బోలెడు తీరిక

అందేత పాత స్కూలు విశేషాలూ కొత్త టీచర్ల మేనరిజమ్సూ కొత్తవారి ముందు పాతవారి వినయాలూ . కొత్త పిల్లల ముందు పాత టీచర్స్‌మీది జోక్సు పక్కఊరి పిల్లలమీద స్థానిక రౌడీపిల్లల ఆగడాలూ . కొత్తగా జతపడే జట్లూ లంచేత విడిపోయే పాతజట్లూ అదో తమాషా

ప్రెస్‌నించి ఫ్రెష్‌గా వొచ్చిన పుస్తకాలు స్కూలు తెరిచిన కొత్తలో పిల్లల చిరునవ్వుల కేమాత్రం తీసిపోవు పైగా అభిమాన తారల అట్టబొమ్మల్తో మరీ పేట్రేగిపోతాయి. హైక్లాసు పుస్తకాలు కాబట్టి పెద్దవాళ్ళమైపోయామన్న భ్రమలో ఒకటికి పదిసార్లు తిరగేస్తారు నోట్సు లెంతో శ్రద్ధగా రాయడం మొదలెడ్తారు. కొత్తలో హోంవర్క్ తక్కువుంటుంది గనకా, పాఠాలు తేలిగ్గా ఉంటాయి కనకా యమ ప్రాంప్ట్‌గా ఉండి బండబ్బాయిలు గూడా టీచర్ల మెప్పు సంపాయిస్తారు. కొత్త మోజులో పాఠాలు శ్రద్ధగా వింటారు కాబట్టీ, కవరైన పోర్షను కొద్దిగానే ఉంటుంది కాబట్టీ మొదటి టెస్టులో వాళ్ళు మంచి మార్కులే తెచ్చుకుంటారు ఆల్‌టైం ఫస్ట్ రాంకర్సుతో పోల్చుకుని మనమూ ఫర్లేదనుకుంటారు

కానీ-రోజులు గడిచేకొద్దీ కొత్త పాతబడిపోతుంది. పాఠాలు పరమ బోరనిపిస్తాయి హోంవర్కు తలకి మించిన బరువౌతుంది పరిచయాలు పాతబడతాయి స్నేహాలు సమసిపోతాయి వీటికి తోడు మధ్యమధ్యలో పరీక్షలొచ్చిపోతూంటాయి మార్కులు తక్కువొస్తుంటాయి తిట్లూ, చీవాట్లూ ఎక్కువౌతూంటాయి దాంతో స్కూలు కెళ్ళి రావడం దినచర్యలో ఒక భాగమైపోతుంది ఫ్లడ్ లైటేసి వెతికినా పిల్లల మొహాల్లో కళాకాంతు లుండవ్ జీవితం యాంత్రికమైపోతుంది మొదట్లో ఉన్న సంబరం ఉత్సాహం మళ్ళీ రావాలంటే పరీక్షలు పెట్టి శలవు లిచ్చేసి మళ్ళీ బళ్ళు తెరవాల్సిందే ■

## 'అవిరామం'

నా చూపుల పాదాలకింద
రోడ్డు ముక్కలు చెక్కలుగా తెగి
బావురుమంటోంది
నా కాళ్ళమీద మొలిచిన కళ్ళకు
ఆకాశం అంతా అలుక్కుపోయి
వెదికే అరుణవర్ణం అగుపించదు
అయినా—
నా ఆశల అమృతం తాగి
పైకెగసిన మరో విహంగం
మాత్రం
తన ప్రయత్నం మానదు

బి. చంద